# పంకజం

"డెబ్భై రూపాయలు కావాలి నాకు."

"ఎందుకు?" వ్రాసుకుంటున్న శ్రీధర్ తలెత్తకుండానే అడిగాడు.

"ఆడవాళ్ళకూ కూడా ఖర్చులుంటాయి. అవసరాలను గురించి యివ్వాలికాని అణా పైసల దగ్గర్నుంచీ ఆరాలు తీయడమేమిటి?" విసుగ్గా వెళ్ళి కిటికీ దగ్గర నిల్చుంది పంకజం.

వ్రాత ఆపుజేసి సాలోచనగా అటు చూచాడు శ్రీధర్. "అవసర మేమిటీ అన్నానుకానీ అవసరముండదన లేదు పంకజా. ఏమైనా రహస్యమా?"

అసలే కోపంగావున్న పంకజ వదనం మరింత కోపంతో అరుణిమ దాల్చింది. "ఎగతాళి అనవసరం. రహస్యమేమిటి మీ దగ్గర! నా స్నేహితురాలు పెళ్ళి, అందుకు."

"అయితే ఏకంగా డెబ్భైలూ, ఎనభైలూ దేనికీ మరీ అంత ముఖ్యస్నేహితురాలు కాదేమో: అంత విలువైనబహుమతి ఇవ్వాలా:"

"ముఖ్యురాలు కాకపోయినా కావలసినదే. పాతిక ముప్పైలో ఏదైనా బహుమతీ, మిగిలినవి ప్రయాణం ఖర్చులు."

ఒక్క క్షణం మాట్లాడలేదు శ్రీధర్. "అయితే యిలా అడగడంలో నీ ఉద్దేశ్యమేమిటి పంకజా? మన ఆదాయ వ్యయాల సంగతి నీకు తెలియనిది కాదుగా!" అన్నాడు కడకు నెమ్మదిగా.

"నేను డబ్బు అడిగినప్పుడల్లా యిలా ఆదాయ వ్యయ పట్టిక ఏకరువు పెట్టడంలో మీ వుద్దేశ్యమేమిటి? మన జీవితాంతం ఈ సమస్య లుండేవే. స్నేహితురాలి పెండ్లి మాత్రం ఒక్కసారే వస్తుంది." పంకజం కంఠస్వరం తీవ్రంగా వుంది. "నాకా సమస్య లన్నీ అనవసరం?"

అదోక మాదిరిగా తలపంకిస్తూ నవ్వాడు శ్రీధర్. "నీకు పరిస్థితులు అర్థమయ్యేవరకూ బోధించవలసిందే. నువ్వనవసరమన్నంత మాత్రాన వదలిపోవు. మన పరిస్థితుల కనుగుణంగా మనం నడుచుకోవాలిగాని – గగనకుసుమాలను ఊహాలోకంలో దండగ్రుచ్చటం వరకే–ఆ మాలమనకంఠాన్నలంకరించడం – ఈ ధరణిలో అసాధ్యం."

ఆశ్చర్యంగా యిటు తిరిగింది పంకజం. "70 రూపాయలు అడగడం అందరాని ఫలాన్నాశించడమే నన్నమాట! అంత మాత్రానికూడా నోచుకోలేదా నేను?"

పరీక్షగా చూచాడు శ్రీధర్. "వంటగదిలో అమ్మతో గానీ ఏమైనా ఘర్షణపడి వచ్చావా? ఏదో ఆవేశంలో వున్నట్టున్నావ్?"

"అవును. అణగి మణగి పడేవాళ్ళుంటే మీ అమ్మా చెప్తారు; మీరూ చెప్తారు. ఇంతకూ యిస్తారా, ఇవ్వరా?"

శ్రీధర్ ఓర్మినశించింది. "యివ్వననడంకాదు పంకజా! ఈ రెండువందల యాభై జీతగాడు నీ ఆర్థికావసరాలు, ఏలా సాలు తీర్చలేడు. మొన్ననే కదా మీ చెల్లెలి పెళ్ళికి ఏవిధంగానైతేనేం మూడువందలు ఖర్చయ్యాయి. అందుకేమీ అనను. అది చాలాముఖ్యం. కాని అవసరమైనవీ కానివీ అన్నీ తట్టుకోలేను. ఓ ఇరవై పాతికలో యేమైనా బహుమతి పంపించు. నువ్వు వెళ్ళక్కర్లేదు."

"నా స్నేహితురాలి పెళ్ళికి నేను వెళ్ళాలో అక్కర్లేదో నాకు తెల్సు."

అంతలో మూడేళ్ళ కొడుకు రఘు అటురావడంతో సంభాషణ ఆగింది.

"అమ్మా, ఎత్తుకో." చేతులు చాపుతూ ముందుకు వెళ్ళాడు.

"పోయి ఆడుకో, లేకపోతే మామ్మ నెత్తుకోమను." విసుగ్గా అంది పంకజం.

బిక్కముఖంతో నిల్చున్న రఘును శ్రీధర్ ఎత్తుకున్నాడు.

"మనచికాకులు సమస్యలు పిల్లలకు తెలియకూడదు. సరే, నువ్వడిగిన దానికి నా శక్తి, సలహాలు వివరించాను. ఆపైన నీ యిష్టం."

రఘును లాలిస్తూ బయటకు వెళ్ళిపోయాడు శ్రీధర్.

మర్నాడు రైలుకు ప్రయాణమౌతున్న భార్యదగ్గర కొచ్చాడు శ్రీధర్. "అయితే నీ పంతం విడువవన్నమాట ? వెళ్ళటానికే నిశ్చయించుకున్నావా?"

"మీ డబ్బేమీ ఇవ్వక్కరలేదులెండి. బాధపడకండి."

"ఓ! 'మీ', 'మా' —చాలా దూరం పోయావు. అయితే డబ్బెక్కడిదో తెల్సుకోవచ్చా ?"

"వుంగరం అమ్మేశాను". ముక్తసరిగా అంది పంకజం.

ఉలిక్కి పడ్డాడు శ్రీధర్. "ఏ ఉంగరం ?"

"నకున్న దొక్కటే ఉంగరం!"

షాక్ తిన్నట్లయాడు శ్రీధర్. "పెళ్ళినాడు నేను స్వయంగా నీ వ్రేలికి తొడిగినదా ? అది అమ్మడానికి నీకు చేతులెలా వచ్చాయి? అంతో యింతో చదువుకున్న దానవు కూడాను! తెల్సుకుంటే ఆనాడు నేను కట్టిన మంగళసూత్ర మంత విలువైనదా ఉంగరం !"

ఆ మాటలలో ధ్వనిస్తూన్న వ్యధను పంకజం ఏమాత్రమూ గుర్తించలేదు. పెట్టె తాళంవేసి లేస్తూ, "మంగళ సూత్రాలనూ, జందెపు పోగులనూ పూజించేకాలం కాదిది. ఇన్ని విలువలు తెలిసిన మీకు నా కోర్కె విలువ తెలియక పోయిందా ?" జవాబుకు ఎదురు చూడకుండానే వెళ్ళి పోయింది.

# 2

రాత్రి తీరికగా వాలు కుర్చీలో పడుకుని కొడుకును గుండెలపై కూర్చోబెట్టుకుని కబుర్లు చెప్తున్నాడు శ్రీధర్. కొంతసేపటికి పంకజం వచ్చింది గదిలోకి. "మామ్మ పిలుస్తున్నారు రఘూ. వెళ్ళి పడుకో" అంది.

"నిద్దల లాటం లేదమ్మా" ఆ నత్తి మాటలకు ముద్దు పెట్టుకుంటూ లేవదీసి రఘును అత్తగారికిచ్చి తిరిగి వచ్చింది పంకజం.

శ్రీధర్‌కు దగ్గరగా ఒక కుర్చీ లాక్కుని కూర్చుంది. కొద్దిసేపు ఎవరూ మాట్లాడలేదు. మెల్లగా పంకజం సంభాషణ కుపక్రమించింది. "నేను ఉద్యోగం చేస్తే మీకేమైనా అభ్యంతరమా ?"

ఆ ప్రశ్నకు శ్రీధర్ చలిస్తాడని భావించింది పంకజం. కాని అతడి ముఖకవళికలలో ఆమెకేమీ మార్పు ద్యోతకమవ్వలేదు.

నిజానికి శ్రీధర్ చలించాడు. ఊహించని—అనుకోని ఆ ప్రశ్న వినగానే వర్ణించరానంతగా అతడి మనోహృదయాలు కదలిపోయి చాలాసేపు స్థాణువులా వున్నచోట వుండిపోయాడు. కడకు మందస్వరంతో అడిగాడు. "అయితే నీ కభ్యంతరం లేనట్టేనా ?"

“ఫ్రాంక్ బహుపుగా నిష్టూరాలాడాడు శ్రీకర్. “బిడ్డ విష యంలో తల్లిగా నీ బాధ్యత అంతేనన్నమాట? నువ్వు పారేసే డబ్బుకు నౌకర్లైతే తేవచ్చును కాని, నీ బాధ్యత, మమత, లాలన లభిస్తాయా బాబుకు వాడిద్వారా?”

“తెలుసు గనుకనే ఆ నిశ్చయానికొచ్చాను.”

“ఇన్నాళ్ళూ లేని ఆలోచన నీకిప్పుడెందుకు కలిగింది?”

“మీకు తెలియదా? నా అవసరాలకు ఒకరిపై అధారపడకుండా వుండటానికి.”

“అవసరాలు - ఆనక, అనవసరం. ఆర్థిక అవసరం ఒక్కటే తీరుతుంది ఉద్యోగంవల్ల.”

“............”

“అయినా నువ్వు పాసైంది యింటర్మీడియట్. అదీ ‘ఆర్ట్స్’ గ్రూప్‌తో. మహావస్తే ఓ డెబ్భై, తొంభై రూపాయల కంటె ఎక్కువ రాదు. అదైనా అతి ప్రయత్నంమీద. గ్రాడ్యుయేట్స్‌కే అతీగతి వుండడంలేదు.”

“ఫర్వాలేదు. అంతేచాలు - ఉద్యోగం నేను సంపాదించుకోగలను. ప్రయత్నిస్తే మార్గమే ఉండకపోతుందా?”

“అయితే అన్నీ ముందే నిర్ణయించుకున్నావన్నమాట! నా సంగతి సరేసరి, రఘును ఏంచేస్తావుని? మొన్న నువ్వు నిర్మల పెళ్ళికెళ్ళిన రెండురోజులూ సముదాయించలేక పోయాను. ఒకటే ఏడుపు.”

కఠినంగా సమాధానం చెప్పింది పంకజం!” ఒకరి ఏడుపు

కోసం, మరొకరి అయిష్టతకోసం చిన్న చిన్న కోర్కెలనూ సరదాలనూ కూడ చంపుకొని జీవచ్ఛవంలా బ్రతుకలేను, రఘును అత్తగారు చూచుకుంటారు లేకపోతే నాలుగైదు రూపాయలకొక నౌకరు కుర్రాణ్ణి ఏర్పాటు చేస్తాను."

"భర్త, బిడ్డలే స్వర్గమనుకుంటూ కూర్చోవడానికిదేం పూర్వకాలం కాదు. అయిదారుగురుపిల్లల తల్లులుకూడా ఉద్యోగాలు చేస్తున్నారీరోజులలో. నేనుద్యోగం చేస్తానంటే బాధ పడుతున్నారు, కనీసావసరాలకు కూడా డబ్బడిగి లేదనిపించుకోవడం నాకెంత బాధ కలుగచేస్తుందో ఆలోచించలేకపోయారు?"

"వృథాగా తర్కించకు పంకజం. నువ్వు ఉద్యోగం చేయడం నాకెంతమాత్రం యిష్టంలేదు. ఆర్థికంగా ఏమైనా బాధలుంటే ఉద్యోగం చేసినా అర్థముంది. చెయ్యాలికూడా. కాని ఆలోచించి చూడు. మనకేలోటూ లేకుండా గడచిపోతూంది. ఇంకా సంసారం పెద్దదై పిల్లలు ఎదిగివచ్చేసరికి చదువులూ, పెళ్ళిళ్ళూ ఎలాగంటావా? నేను కడుతున్న ఇన్స్యూరెన్సులు అప్పుడు ఆదుకుంటాయి. నేనున్నా, లేకపోయినా ఏలోటూ ఉండదు, ఇక నీకు ఉద్యోగం దేనికి? అనవసర విలాసాలకు—అంతేనా?"

"అనవసర విలాసాలని ఎంత తేలికగా తీసిపారేశారు? ఈ నాగరిక యుగంలో మనుష్యులు వాంఛించేది కేవలం తిండి, నిద్రేనా? మరే వ్యాపకం అక్కర్లేదా? సంఘంలో బ్రతుకుతూన్న మనకు అనేకవిధాలుగా ఇతర ఖర్చులుండవా?

అంతెందుకు? మీ స్నేహితులకు, విలాసాలకు మీరు ఖర్చు పెట్టుకోవడం లేదా?"

"ఎందుకు, 'మీ-నా' అంటూ గోరంతలు కొండంతలు చేస్తావు? సాగినంత మేరకు యిద్దరం ఖర్చు పెడ్తూనే ఉన్నాం. నువ్వూ-నీ ఖర్చూ అంటూ నిన్ను నేను వేరుగా చూడడం లేదు. పరిస్థితులకు అనుగుణంగా సర్దుకోమ్మంటున్నాను. నేను ఎన్ని అవసరాలు చూసుకుంటానో నీకేం తెలుసు? కాని పైకి చెప్పి బాధపడి అందర్నీ బాధ పెట్టను. ఈ భూమిమీద పుట్టిన మానవులందరికీ ఏదో లోపం, బాధా ఉంటూనే ఉంటాయి. దైవ కృపవల్ల మనకున్న ఆర్థిక లోపం అంతగా విచారించవలసింది కాదు. మిగిలిన అన్ని విషయాలలోను ఎంతో హాయిగా, సంతృప్తిగా గడచిపోతోంది. అంచేత సంతోషంగా వుండు. ఏ దిగులూ పెట్టుకోకు. నా శక్తి మేరకు నీకేలోపం రానివ్వను."

"ఇవన్నీ నే నాలోచించక పోలేదు. డబ్బు అవసరమై చేతిలో విద్యవుండి ఎందుకు చేతులు ముడుచు కూర్చోవాలి?"

కుర్చీలో పడుకున్న శ్రీధర్ లేచి తిన్నగా కూర్చున్నాడు. "చూడు పంకజం! అది నువ్వు చిన్న విషయంగా మాట్లాడుతున్నావు కాని అందులో ఎన్ని సాధకబాధకాలుంటాయో. ఒక్క ఆర్థికసమస్యను తీర్చే ఆ స్త్రీ వుద్యోగం ఎన్ని ఇతర సమస్యలను సృష్టిస్తుందో నువ్వాలోచించటంలేదు. జీతంకట్టి వెయ్యిమంది మగవాళ్ళున్న కాలేజీలో

చదువుకోవటం వేరు; జీతం అందుకోటానికి పదిమంది పురుషులమధ్య కూర్చుని స్త్రీ ఒక అధికారిక్రింద పనిచేయటం వేరు. ఎంత ప్రగతి సాధించామనుకున్నా, పదిమందిలో తిరిగే స్త్రీని గౌరవ మర్యాదలతో చూడగల సంస్కార మందుకో లేదు ఇంకా మన దేశం. ఇదొక సంధియుగం. అటు 'ప్రాత' పూర్తిగా వదలలేదు—ఇటు క్రొత్త పూర్తిగా జీర్ణంకాలేదు. ఈ ప్రాత కొత్తలవల్లనే అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. అయినా మనం ఆపలేం. ఒకనాటికి ఆ పరిస్థితులుగా వచ్చితీరుతాయి. హిందూదేశం నాటిదేశాలతో సరితూగిందని గర్విస్తారు. కాని అతి పురాతనమైన, అతి విలువైన కుటుంబ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుంది. స్త్రీపురుషు లిరువురికీ విద్య వుంటుంది. ఇద్దరూ ఉద్యోగాలు చేస్తారు. సంతానాలకు 'నర్సరీ' లుంటాయి. వృద్ధుల ఆలన పాలనలకుకూడా సంస్థలు నెలకొంటాయి. మనుష్యులు కూడా యాంత్రికంగా మారిపోతారు. తల్లీ బిడ్డలమధ్య, భార్యాభర్తలమధ్య ఉండే ఆహ్లాద మధురపూరిత సంబంధ బాంధవ్యాలు సమసిపోతాయి. కుటుంబాలలో నిండుదనం తొలగిపోతుంది. ఇప్పటికే ఇటువంటి దేశాలు కొన్ని వున్నాయి. స్త్రీ పురుషు లిరువురూ శ్రమిస్తారు. భోజనశాలలు, పిల్లల నర్సరీలు, వృద్ధుల సంక్షేమ నిలయాలు వుంటాయి. ప్రభుత్వమే నడుపుతుంది వాటిని. గృహిణికి వంట బాధ్యత లేదు. తల్లి పిల్లలను సాకే అవసరం

లేదు. యువతరం వృద్ధులను సేవచేయ నవసరంలేదు. స్త్రీ పురుషులు ఇద్దరూ సమానమే. ఇద్దరికీ సంపూర్ణ స్వేచ్ఛ!"

"వింటున్నావా పంకజం, ఎలాగుందిది నీకు? ఎవరికెలాగున్నా మారుతున్న ప్రపంచంలో మార్పులు తప్పవు. ఒక నాటికి రామాయణ, భారతాల ప్రసక్తే వుండదు. సీతా సావిత్రుల నామాలే ఎవరికీ తెలియవు. ప్చ్! నిస్సహాయులం! కాని భవిష్యత్తులో రాబోయే అఘోర సంచలనానికి, విపరీతానికి మనమే ఎందుకు నాందీగీత మాలాపించాలి? ఆలాపించినవారిలో ఒకరం ఎందుకు కావాలి? ప్రథమ బాధితులలో ఒకర మెందుకవ్వాలి? నిర్మలంగా వున్న యీ సంసార సుఖశాంతులను చెదరగొట్టకు పంకజం. బాగా ఆలోచించు."

వినివిని నిర్లక్ష్యంగా సమాధాన మిచ్చింది పంకజం. "నలకను కూడా భూతద్దంలో చూపి భయపెట్టడం మీకు బాగా వచ్చు. నేనొక్కతెను కట్టుబడి వున్నంత మాత్రాన వచ్చే మార్పు లాగిపోతాయా? నేను వుద్యోగం చేయటానికే నిశ్చయించుకున్నాను." సంభాషణ ముగించేసి వెళ్ళి పడుకుంది.

తనలో తను అనుకుంటున్నట్టుగా అన్నాడు శ్రీధర్: "అర్థం చేసుకోగలవాళ్ళకు చెప్పగలం గానీ విలక్షణంగా ఆలోచించేవాళ్ళకు నచ్చచెప్పేదెలా? కానీయ్, కొన్ని కొన్ని విషయాలను అనుభవాలే తెలియజెప్పాలి."

# 3

ఆదివారం మధ్యాహ్నం కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్న సుమతి యింటికి బయల్దేరింది పంకజం. ఆ ఇద్దరూ యింటర్మీడియేట్‌లో సహాధ్యాయులు; స్నేహితులు కూడా.

"సుమతి యింట దగ్గర లేదమ్మా, ప్రైవేటు క్లాసు పెట్టింది. కాలేజీకి వెళ్ళింది." సుమతి ముసలితల్లిముక్కుతూ మూల్గుతూ చెప్పింది. ఆవిడ ఎనభై ఏళ్ళ వృద్ధురాలు.

"నాకా కళ్ళు కనిపించవు. ఏ పనీ చేయగల ఓపిక లేదు. ఇటు నాకు చాకిరీచేస్తూ అటు పిల్లల్ని చూసుకుంటూ, ఆ కాలేజీలో నానా యాతనాపడి డబ్బు సంపాదిస్తోంది. ఆదివారంకూడా ఖాళీ లేదు. ఇంట్లో పిల్లలందరికీ జ్వరాలు. అదొచ్చేవరకూ వాళ్ళకు మంచి నీళ్ళిచ్చే గతికూడ లేదు. దేవుడెన్నిపాట్లు రాశాడు?" కళ్ళొత్తుకుంటూ చెప్పింది ముసలామె.

సానుభూతితో యిల్లంతా కలియజూచింది పంకజం. సుమతి పిల్లలు నలుగురూ రోగాలతో మంచాలమీద పడి వున్నారు. ఇల్లంతా చిందరగా తుక్కుతో, మాసిన బట్టలతో గలీజుగా వుంది. ఒక పిల్లవాడు అదేపనిగా 'అమ్మా', 'అయ్యో' అంటూ మూల్గుతున్నాడు. పంకజం దగ్గరకెళ్ళి

చూచింది. ఒళ్లు కాలిపోతోంది. మరోపిల్ల తనలోతనే క్రుళ్ళి క్రుళ్ళి ఏడుస్తోంది. పంకజం అడిగితే "కాఫీ కావాలి. అమ్మ వచ్చేవరకూ ఎవరిస్తారు?" అంది మరింత వెక్కి వెక్కి పడూ.

పంకజం మనస్సు జాలితో కరిగిపోయి కండ్లలో నీళ్ళు నిలిచాయి. పాపం, సుమతి భర్త కలరా తగిలి చనిపోయాడు. అదృష్టవశాత్తు సుమతి చదువుకుంది. అదికూడ లేకపోతే యింకా ఎన్ని బాధలు పడుదురో! కాఫీకాచి, పిల్లలకూ, ముసలమ్మకూ యిచ్చి, ఇల్లు శుభ్రంగా సర్ది సుమతికోసం చూస్తూ కూర్చుంది పంకజం. నాలుగున్నరకు సుమతి వచ్చింది పుస్సురనుకుంటూ. వస్తూనే పిల్లలప్రక్క దగ్గరకెళ్ళి ఒక్కొక్కళ్ళనే చూచుకుంది. టెంపరేచర్ చూచి, ఏం కావాలో అడిగింది.

"పంకజం పిన్ని యిచ్చారు కాఫీ" అని చెప్పాడు కాస్త జ్ఞానంవున్న పదేళ్ళ పిల్లవాడు.

"నీకూడా వుంది ఆ ఫ్లాస్కులో, తీసుకో" అంది పంకజం.

"థాంక్స ! రా యిద్దరం తీసుకుందాం" అంటూ సుమతి పంకజం ప్రక్కన కూర్చుంది.

"చూస్తున్నావా నా అవస్థ! ఆయన ఉన్నన్నాళ్ళూ ఎంత సౌఖ్యంగా గడచిపోయిందో; అన్ని పాట్లూ పడుతున్నాను. దేవుడికి నాపై దయలేదు. ఈ పిల్లల్ని చూచుకోవాలి, చచ్చేలా చాకిరీ చేసుకోవాలి. అటు కాలేజీలో చచ్చేట్టు అరిచి, అరిచి పాఠం చెప్పాలి. అదైనా నా మర్యాద

గానా? ఒకడు కుక్కకూత, మరొకడు గాడిద అరుపు, ఇంకొకడు ఇకిలించడం—ఒక్క అవస్థ కాదు. పరీక్షలు దగ్గరకొస్తున్నాయి, 'కోర్సు' అవలేదని మొన్న 'చీఫ్' పిల్చి వ్యాఖ్యానించాడు. ఏదో ఒక అల్లరిచేస్తూ ఈ స్టూడెంట్లు కోర్సు అవనివ్వరు. పాఠం జరుగదు. వాళ్ళను గట్టిగా ఏమైనా అంటే స్ట్రయికులు. దానితో ఇటు స్టూడెంట్సుకూ లోకువే, అటు లెక్చరర్సుకూ లోకువే. గతిలేక చెయ్యడం కానీ—లెక్చరర్, ప్రొఫెసర్, ఆఫీసర్ అంటూ పెద్ద గంభీరంగా వినిపిస్తాయి, ఈ ఉద్యోగాలు. నిజానికి అవన్నీ కూలిపనులే... ఈ పిల్లలంతా ఫ్లూ జ్వరంతో పడివున్నారు. వేరే చూచేదిక్కులేదు. అయినా చచ్చినట్టు ప్రైవేటు క్లాసుపెట్టి చెప్పి వచ్చాను. ఇప్పుడు వచ్చానా? ఆస్పత్రికి పోయి మందు తేవాలి. బజారుకుపోయి ఏమైనా పళ్ళూ, కూరలూ తెచ్చుకోవాలి; యింటికొచ్చి మళ్ళీ యింటెడు చాకిరీ చేసుకోవాలి. తెల్లారి కాలేజిలో క్లాసులకు చెప్పబోయే పాఠం కాస్త చూచుకోవాలి. ఖర్మ" మొఖం కొట్టుకుంది సుమతి. పంకజం చూడకుండా అటుతిరిగి కళ్ళు తుడుచుకుంది.

"ఈ పిల్లలు కాస్త ఎదిగివచ్చే దెప్పుడో, నా పాట్లు తీరేదెప్పుడో?" గాద్గదికంగా అంది.

"పోనీ ఒక వంటమనిషిని పెట్టుకోంటే?" అడిగింది పంకజం.

ఆ సౌభాగ్యము అయ్యింది. నెల్లాళ్ళపాటు వచ్చే సరుకులన్నీ వారం రోజులకే అయిపోయాయనేది ఒకర్తె.

ఇంటికి పట్టుకుపోయేదో, దుబారా చేసేదో తెలియదు. మరొకడు రెండ్రోజులు చేసి రేడియో పట్టుకు చక్కా-పోయాడు. ఇక హడలిపోయి వంటవాళ్ళ పేరెత్తడం మానేశాను."

కొంచంసేపు కూర్చుని వెళ్ళిపోయింది పంకజం. సుమతి ద్వారా ఉద్యోగపు ప్రయత్నం చేద్దామనుకున్న ఆమె ఉద్దేశ్యం, సుమతి కుటుంబస్థితి కళ్ళారా చూచాక, సుమతి కష్టసుఖాలన్నీ చెవులారా విన్నాక, ఉద్యోగం చేయాలన్న తలంపు మనసులోనే సమాధి అయిపోయింది.

"సుమతి ఏదైనా ఉద్యోగ మిప్పిస్తానన్నదా ?" అడిగాడు శ్రీధర్ రాత్రి.

"నేనంటుకు వెళ్ళ లేదు" అంది పంకజం ముక్తసరిగా.

# 4

"దీపావళికి రమ్మని మామగారు ఉత్తరం వ్రాశారు" అని లెటరు అందిచ్చాడు ఒకరోజు శ్రీధర్.

అందుకొని ఆత్రతగా చదువుకుంది పంకజం. "పండక్కి-మా పెద్దచెల్లెలుకూడా వస్తోందిట. మరెప్పుడు వెళ్దాం? వారం రోజులే వుంది" అంది ఒకవిధమైన ఉత్సాహంతో.

అందుకు సమాధానం అత్తగారినుండి వచ్చింది. "ఈ మధ్యనేగా చెల్లెలిపెళ్ళికి వెళ్ళి నెల్లాళ్ళుండి వచ్చావు! పుట్టిం

ట్లోనే కాదు పండుగ, యిక్కడా వుంది. ఓసారి స్నేహితురాలి పెళ్ళి, మరోసారి చెల్లెలి పెళ్ళి, యింకోసారి పండుగ అంటూ తిరగడమ నేమిటి అస్తమానూ!"

శ్రీధర్ మెల్లగా లేచి వెళ్ళిపోయాడు "ఆఫీసు టైమైంది" అంటూ.

చర్రున కోపం వచ్చింది పంకజానికి. "ప్రతిదానికీ అందరి సలహాలూ అనవసరం. నా పుట్టింటికి నేను వెళ్ళడానికి కూడా నీతిబోధ లేనా ?"

జయమ్మ అసలే ముక్కోపి. "ఒక్క దీపావళికేం ? పోయి శాశ్వతంగా అక్కడే పడుండు" అని దర్జాగా అక్కడి నుంచి లేచి వెళ్ళిపోయింది.

పంకజం ముఖం కోపంతో జేవురించింది. సుడిగాలిలా వెళ్ళింది భర్త గదిలోకి. తల దువ్వుకుంటూన్న శ్రీధర్ అద్దంలో భార్య ప్రతిబింబం చూచికూడ చూడనట్లే ఊరుకున్నాడు.

"ఇంకొక్క క్షణముండను నీ యింట్లో" ఒక్క గావుకేక పెట్టింది పంకజం.

గమనించనట్లే టై కట్టుకోసాగాడు శ్రీధర్.

"మీకే చెప్పేది. వినపడటం లేదూ?" ఉడుకుమోత్తనంగా అరిచింది తిరిగి.

"ఏమిటే?" అన్నాడు శ్రీధర్ తల త్రిప్పకుండానే తాపీగా. అద్దంలో చూస్తూనే ఉన్నాడు ఆమె రౌద్రాకారం.

"ఏమిటట ఏమిటే! ఏమీ ఎరుగనట్టు! పండక్కు పుట్టిం

టికి వెళ్ళానంటే శాశ్వతంగా పుట్టింట్లోనే వుండమనే మనిషి కూడా వుండదు, యిక్కడే కాని. నాకేం బెదిరింపా? మహా రాణీలా వుంటాను. ఈ దరిద్రమూ తప్పుతుంది. నన్ను భరించ లేనంత బీదది కాదు నా పుట్టిల్లు."

"తప్పు తప్పు. బీద యింట్లో దానవైతే నన్నెలా కొను క్కుంటావు యిన్ని వేలుపోసి? తర్వాత ఆలోచిద్దాం కాని, భోజనం చేద్దాం పద. ఆకలి జాస్తి యినకొలదీ తెలివినాస్తిట. ఇంకా భోజనం పడక, నూరాంఫి జోరుగా వుంది ఏ ధోరణీ" అంటూ భార్య చేయి పట్టుకున్నాడు నవ్వుతూ.

"నేను రాను" చెయ్యి విదిలించుకుని వెళ్ళి పెట్టె సర్దుకోసాగింది.

"కోపంగా ఉన్నా అందంగా వున్నావు సుమా! నీకు సత్యభామ పేరు పెట్టవలసిందసలు!" నవ్వుతూ నవ్వుతూ పరిస్థితి తేల్చేయజూచాడు శ్రీధర్.

పంకజం ఆ హాస్యమేమీ పట్టించుకోలేదు. "వెంకమ్మా, చాకలింటికి కెళ్ళి బట్టలుతికినా సరే, లేకున్నా సరే పట్టించు కొచ్చెయ్యి" అని పనిమనిషి కాజ్ఞాపించింది.

పరిస్థితి విషమించిందని గ్రహించాడు శ్రీధర్. దగ్గర కూర్చుని బ్రతిమాలుతున్న ధోరణిలో అన్నాడు. "చూడు పంకజం, ఏమిటీ తొందరపాటు? వయస్సధికమైనకొలదీ చాద స్తులౌతారు. నీకు ఆ విషయంలో వాదమెందుకు? వెళ్ళాలని వుంటే నేను పంపనూ?"

"చాలా సంతోషం. నాకు విద్యా అధికారాలూ వద్దు, మీ దయాధర్మాలూ వద్దు. నాలుగేళ్ళు భరించాను. ఇంక నా వల్లకాదు. నా దారి నన్ను చూసుకోనీయండి" పెట్టె సర్దుకుంటూనే స్థిరంగా అంది పంకజం.

"సరే, నీ యిష్టం". ప్రస్తుతం ఏం చెప్పినా వినేట్టు లేవు" ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

పదకొండు గంటలకు ఆఫీస్ ప్యూన్ వచ్చి ఒక కవరిచ్చాడు పంకజానికి, "అయ్యగారిమ్మన్నా" రంటూ. అప్పటికామె ప్రయాణానికి సిద్ధమైపోయి రఘును ముస్తాబు చేస్తోంది. కవరు విప్పింది. అయిదు పదిరూపాయల నోట్లు ఎవరిదగ్గరో బదులు తీసుకు పంపించాడన్నమాట! ఈ పని ముందే చేస్తే ఎంత బాగుండును! ఇప్పుడెందుకు?

"మిమ్మల్ని రైలుకి పంపి రమ్మన్నారండి" అన్నాడు బంట్రోతు.

"అవసరం లేదు. నువ్వు వెళ్ళొచ్చు. ఈ కవరుకూడ వారికే యిచ్చెయ్యి" వాడు నిర్ఘాంతపోతూ వెళ్ళిపోయాడు.

వీధిలో జట్కా నిల్చుంది. పెట్టెలు బండిలో కెక్కుతున్నాయి. అంతలో రిక్షాలో దిగాడు శ్రీధర్. జయమ్మ మనస్సు కాస్త కుదుటపడింది. సిప్పల్లు తొడుక్కుంటున్న పంకజం కళ్ళు గర్వంగా మెరిశాయి. తనపట్ల అతడికున్న విధేయతకు.

"ఇలా నిల్చున్నపాళాన ప్రయాణమైంది, కోపగించిందా?" అడిగింది జయమ్మ కొడుకును.

"అక్కర్లేదమ్మా, నేనే పంపిస్తున్నాను. పోనీ పండగకి వాళ్ళు రాశారు కదా. పదిరోజులుండి వస్తుంది" సర్ది చెప్పేశాడు.

ఆ మాటలు విన్న పంకజం కొద్దిగా బాధ పడింది. "ఇంత ఉత్తముడి మాటనా పెడచెవిని పెట్టి పోతున్నాను?" వేస్తున్న కాలు వెనుకకు తీసుకుంది.

"ఏం, రెడీయేనా?" అన్నాడు శ్రీధర్ భార్యనుద్దేశించి. కరుగుతూ కరుగుతూ వున్న పంకజం మనస్సు మళ్ళీ బిగిసిపోయింది. "ఆఁ" అంది పెడసరంగా. వెళ్ళి బండెక్కి కూర్చుంది.

మనవడిని అందిస్తూ "బిడ్డ జాగ్రత్తమ్మా. వేళాపాళా నీళ్ళూ పాలూ చూస్తుండు" అంది జయమ్మ. పంకజం మాట్లాడలేదు. వెళ్తున్నట్లు చెప్పలేదు.

వెయిటింగ్ రూమ్‌లో కూర్చోబెట్టి టిక్కెట్లు కొని, టిఫెన్, కాఫీ పట్టించుకొచ్చాడు శ్రీధర్. చేతిలోనున్న చామంతి దండ అందివ్వబోయాడు భార్యకు. "అక్కర్లే" దంటూ ముఖం త్రిప్పుకుంది పంకజం. లోలోపల మహాకష్టంగా వుంది శ్రీధర్‌కు. కాని పైకి చాలా శాంతంగా నవ్వుతూనే వున్నాడు. పువ్వులు బలవంతాన జడలో పెట్టాడు. కాని కాఫీ మాత్రం ఎంత ప్రయత్నించినా త్రాగించలేకపోయాడు.

"ఫ్యాన్‌ను పొమ్మన్నావని నేను వచ్చాను" అన్నాడు సంభాషణ ప్రారంభిస్తూ.

పంకజం ఏమీ అనలేదు. ముఖంమాత్రం / చంద్ర కాంతం మాదిరిగా వుంది.

"పెట్టె తాళం ఒకసారిస్తావా?" అడిగాడు.

"ఓ! చూచుకోండి మీవేం తీసుకుపోవడం లేదు" తాళం యిచ్చి బాత్‌రూమ్‌లో కెళ్ళిపోయింది. కాని ఆ సమయంలో అతడి వదనం గనుక చూచివుంటే అదరిపోయేదే. ఆమె తిరిగివచ్చేసరికి పెట్టెమూసి తాళంబిగిస్తున్నాడు శ్రీధర్.

భార్యనూ, కుమారుడినీ ట్రెయినెక్కించి, క్రింద నిల్చున్నాడు శ్రీధర్. పర్సులోంచి యాభై రూపాయలుతీసి, "ఇవి వుంచు. తర్వాత యింకా పంపిస్తాను" అన్నాడు. ఆమె చెయ్యి చాపలేదు, తీసుకోలేదు.

"అసలింక నేను అక్కర్లేదా పంకజం? పూర్తిగా తెగతెంపులు చేసుకు వెళ్తున్నావా?"

పంకజం మాట్లాడలేదు.

అప్పటికేవారు కంపార్ట్‌మెంట్‌లో అందరి దృష్టినీ ఆకర్షించారు. చక్కటి ఈడూ జోడూ! అంటోంది ఓ ముసలమ్మ. ఇక విసుగన్పించింది శ్రీధర్‌కు. "పంకజం! పండక్కు వెళ్తున్నావు. అంతే ఎన్నాళ్ళుండాలని వుంటే అన్నాళ్లూవుండిరా. మనోభావం గానీ; కోపంగానీ పెట్టుకోకు. మరో నెలైనాసరే ఏడాదికైనా సరే లేక రేపే అయినాసరే రావాలన్పించగానే నిస్సందేహంగారా. నీ కోసం రఘు కోసమూ ఎదురుచూస్తూంటాను." డబ్బు రఘుషర్టు జేబులోవుంచి త్వరత్వరగా వెళ్ళిపోయాడు.

# 5

"అల్లుడుగారు రాలేదమ్మా పంకజం?"
"బావ రాలేదేం చెల్లాయ్?"
"బావేడే అక్కయ్యా?"
"అన్నగారు రాలేదటమ్మా పంకజం?"

గుమ్మంలో అడుగుపెట్టాండగానే తల్లీ; వదినా, అన్న తమ్ముడూ అందరూ అదే ప్రశ్న. వివాహమైనది మొదలు యింతవరకు అతడెప్పుడూ పంకజాన్ని ఒంటిగా పంపలేదు మరి !

"సెలవు దొరకలేదు." తెచ్చి పెట్టుకున్న నవ్వుతో సమాధానమిచ్చింది. "నా రాకకు ప్రాముఖ్యంలేదు. ఆయనెందుకు రాలేదో కావాలి అందరకూ." లోలోన విసుక్కుంది.

ఆ సాయంత్రం గదిలో పడుకున్న పంకజం దగ్గరకు వచ్చి "నాన్న కావాలి అని ఏడ్వసాగాడు రఘు. పంకజం అభిమానం మరింత దెబ్బతింది.

"ఈ వెధవకూడా ఆయనే కావాలి. నేనక్కర్లేదు." అనుకొని అలాగే పడుకొంది లేవకుండా. ఏమిటో మనస్సంతా వికలంగావుంది. అది భయమూకాదు; విచారమూకాదు.

పంకజం వదిన లక్ష్మి వచ్చింది గదిలోకి రఘును ఎత్తు

కాని. ఊరుకోబెట్టి, నౌఖరుకిచ్చి మళ్ళీ వచ్చింది. "ఇంకా యిలా పడుకున్నావేమిటమ్మా? మీ అన్నయ్య సినీమా ప్రోగ్రాం వేస్తేనూ?" అంతలో అన్నయ్య శేఖరంకూడా తానే వచ్చాడు.

"లేలే. అట్టే టైము లేదు." జబర్దస్తీగా అన్నాడు. "మళ్ళీ మేము రేపు సపత్నీకంగా అత్తారింటికి దయచెయ్య బోతున్నాం."

ప్రక్క వరండాలో పేపరు చదువుకుంటూన్న అనంతయ్య అన్నాడు కూతుర్నుద్దేశించి. "వెళ్ళమ్మా పంకజం. మళ్ళీ నువ్వు వచ్చేలోగా వాళ్ళు వస్తారో రారో? సరదాగా వెళ్ళండి. రఘును నాతో షికారుకు తీసుకువెళ్తాన్లే."

ఇక తప్పేటట్టు లేదని బలవంతంగా లేచింది పంకజం. రఘును ముస్తాబు చేయబోతూంటే "వాడి సంగతి నేను చూసుకుంటాను లెమ్మని తల్లి తీసుకుపోయింది. పంకజం హృదయం గర్వంగా నాట్యం చేసింది. "ఎక్కడైనా నేలను నడవనిస్తేనా? అత్తింటికీ పుట్టింటికీ ఎంత తేడా! భర్తా, అత్తగారూ వచ్చి కాళ్ళు పట్టుకునేవరకూ వెళ్ళకూడ" దనుకుంది.

సినిమానుంచి తిరిగి వచ్చేటప్పటికి రఘు అమ్మమ్మ పక్కలో పడుకొని నిశ్చింతగా నిద్రపోతున్నాడు. లేవదీయబోతూంటే "వుండనీ అమ్మా. అక్కడెలాగూ తప్పదు. ఈ నాల్గురోజులైనా కాస్త సుఖంగా నిద్రపో" అంది తల్లి. తృప్తిగా తన ప్రక్కమీద వాలింది పంకజం.

మర్నాడుదయమే లక్ష్మి, శేఖరం వెళ్ళిపోయారు. మధ్యాహ్నం ట్రెయినులో అనూరాధా, ఆదినారాయణా దిగారు. వస్తూనే అక్కను కౌగిలించుకుంది అనూరాధ.

సహజంగా పంకజం అనూరాధ కంటే అందమైనదైనప్పటికీ, ఇప్పుడు అక్కకంటే అనూరాధే అందంగా, షోగ్గా వుంది. ఖరీదైన షిఫాన్ చీర, ఫాషన్ కత్తిరింపుల జాకెట్టూ, అందమైన హెయిర్ స్టయిల్, కాళ్ళకు చెమ్కీపని చేసిన నప్పారు స్లిప్పర్సు, చేతిలో అందమైన వానిటీ బాగ్ చూచేప్పటికి కొంచెం ఈర్ష్య కలిగింది పంకజానికి.

"దానికేం తక్కువ? ఢిల్లీలో కాపురం. గజెటెడ్ ఆఫీసర్ భార్య. అత్తా, ఆడుపాజ్ఞలూ లేని స్వతంత్రం. అలాగుండాలి జీవితమంటే" అనుకొంది. "నన్ను బీదవాళ్ళకు, మామూలు వుద్యోగస్థుడికి చేశారు నాన్నగారు" అని కొంచం కోపం కూడా వచ్చింది.

తెల్లవారితే పండుగ. ఆ రాత్రి భోజనాలదగ్గర అనంతయ్యగారన్నారు. "శ్రీధర్ కూడా వస్తే ఈ నాల్గురోజులూ కళకళలాడుతూండు నిల్లు. ఎంచేతో రాలేదు."

"అవునవును. మీకక్కవలసినవి కళకళలు, మాకక్కవలసినవి గలగలలూను" అన్నాడు ఆదినారాయణ.

"అబ్బే. అతనటువంటివాడు కాదు. చాలా ఉత్తముడు. ఈ కాలంలో అటువంటి మనిషినెక్కడా చూడం..." అనంతయ్య యింకా యేమేమో అంటూనే వున్నాడు.

"ఓహో!" అంటూ చెయ్యి కడుక్కొని వెళ్ళిపోయాడు ఆదినారాయణ.

"అతడసలే కోపిష్టి మనిషట. ఎవరిదగ్గరైనా మరీ— పిచ్చి ధోరణి మీద" విసుక్కొంది సీతమ్మ.

"అలాగా! మరి, ఈ నాలుగురోజులనుంచీ చూస్తూనే వున్నాను. ఒక్కడూ ఆగదిలోనే కూర్చుంటాడు. ఎవరితోనూ ఓ మాటా మంచీ లేదు. అయితే అతడెప్పుడూ అంతేనా అనూరాధా? ఇంకా మంచివాడని మురుస్తున్నాను నేను. పెళ్ళవ్వగానే వెళ్ళిపోయావు. నీసంసారం సంగతినాకేమీ తెలియదమ్మా!"

ఖంగారుగా అడిగాడు అనంతయ్య. పేలవంగా నవ్వి వూరుకుంది అనూరాధ. "ఊరుకుందురూ, అతడు వింటే మళ్ళీ అదో రభస" అంది సీతమ్మ. ఈ వారం రోజుల్నుండీ "ఇది జలంధర్ నుండి తెచ్చారు. అది పాట్నానుంచి తెప్పించారు" అంటూ చెల్లెలు చూపించే నగల్నీ, దుస్తుల్నీ చూచి ఓ ప్రక్క మురిసిపోతూ, ఓ ప్రక్క ఈర్ష్యపడుతున్న పంకజానికిదంతా అయోమయంగా వుంది.

రాత్రి పడుకోటానికి తన గదిలోకి వెళుతూన్న పంకజానికి అప్రయత్నంగా అనూ, ఆదినారాయణల సంభాషణ వినవచ్చింది.

"పండగ రేపే కదా? రేపు రాత్రి ట్రయినుకు రెడీగా వుండు."

"... : ......"

"ఓసి మొద్దూ! నిద్రపోయావేమిటే, అప్పుడే?"

"లేదు. వింటున్నా" అనూరాధ సన్నని గొంతు.

"వినికూడ సమాధానం లేదు. పుట్టిల్లనేమిటి భరోసా ?"

"కాదండీ, నాకింకో నాల్గురోజు లుండాలని వుంది. అసలు పండగంతా ఎల్లుండి కదా!" బెదుర్తున్నట్లుంది అనూరాధ కంఠస్వరం.

"అవతల మన చుట్టమెవ్వడూ లేడు సెలవివ్వడానికి."

"పోనీ మీరు వెళ్ళకూడదా?"

"ఏమిటే?" అది మాట కాదు; ఉరుము! "నేను లేక పోతే విచ్చలవిడిగా తిరుగుదామనా? ఏమ్లేదు. రేపు వెళ్ళి తీరాలి. చచ్చితీరాలి."

ఇక వినా లన్పించలేదు పంకజానికి. అసహ్యించుకుంటూ త్వరత్వరగా వెళ్ళిపోయింది. పడుకోవడమే కాని పంకజకు నిద్రపట్టలేదు. "నోరారా "పంకజా" అని తీయగా ప్రేమగాపిల్చే తన భర్తకూ యితడికీ ఎంతతేడా! భర్త ముందు నోరు మెదపడానికే జడుస్తోంది అనూరాధ. తానెంత కోప గించుకున్నా, విసుక్కున్నా సరే విడువకుండా కూడాకూడా తిరిగే భర్తను అలా చులకనజేసి వచ్చేయడంలో పొరపాటేమైనా జరిగిందా?" వచ్చిన తర్వాత వారం రోజులకు పునశ్చరణ చేయబూనింది. కాని ఆ వెనువెంటనే అభిమానం తలెత్తింది. "నా పిచ్చికాని, అడుగడుగునా పతులు వర్ణించేవాళ్లు

మంచివాళ్ళా? అంత ప్రేమ వుంటే—నాకు కాకపోతే నా తండ్రికైనా ఒక ఉత్తరం వ్రాశారా?"

మర్నాడుదయం తల్లి పిండివంటలుచేసే హడావుడిలో వుంది. అనూరాధ స్నానంచేసి వచ్చి దొడ్డిలో అరుగుమీద జుట్టుతడి ఆర్పుకుంటూ కూర్చుంది. పంకజం మెల్లగా చెల్లెలి దగ్గర చేరింది.

"ఏమిటే అనూ, రాత్రి మీరిద్దరూ ఘర్షణపడుతున్నారు?"

"ఏం లేదక్కా! ఏముంది?" అంది అనూరాధ ఏమీ తెలియనట్టు.

"అయినా అతడంత మోటుగా మాట్లాడతాడేమిటే నీతో? అంత చదివాడు—ఈ కాలంలో కూడ యివేం పిలుపులు "యేమే-ఒసే" అని? భార్యను పేరుతో పిల్చుకోవడం కూడా తెలియనంత అనాగరికుడా?"

గుచ్చిగుచ్చి అడుగుతూంటే యింకా మౌనంగా వుండలేకపోయింది అనూరాధ. "ఏం చెప్పనక్కా పెళ్ళయి వెళ్ళిన ఈ ఏడాదినుంచీ నిన్నూ, బావనూ, మీ అనురాగాన్నీ తల్చుకు సంతోషించని రోజు లేదు. ఎంత చదివితేనేం? సుఖపడటం చాతనవ్వాలిగాని కార్లూ, మేడలూ, నౌకర్లూ వున్నంతమాత్రాన ఆనందం లభించదు. నాపై చెప్పలేనంత అనుమానం. ఎక్కడికీ వెళ్ళకూడదు నేను. ఏ ఆఫీసర్ల పార్టీ అయినా వుండి భార్యను తీసును వెళ్ళడం తప్పనిసరైనప్పుడు నన్నుకూడా తీసుకువెళతారు. కాని కళ్ళు ఎప్పుడూ నాపై నిఘా. నేనెక్కడికి రాసే వుత్తరాలు తనకు చూపించి మరీ

వ్రాయాలి. అడుగడుగునా ఘుమఘుమ లాడ్తూనే వుంటారు. మా అత్తగారు దగ్గరలేదన్నమాటే గాని రెండుమూడు రోజులకో వుత్తరం వ్రాస్తుంటుంది. భార్యనలా అదుపులో పెట్టు; యిలా జాగ్రత్తలో పెట్టు అంటూ.

నా మనస్సుకెక్కడా సంతోషమే వుండదు. ఇంతోటి బ్రతుకూ ఎలాపడి వుంటే లెమ్మని ఎలాగో ఓలాగుంటే వల్ల కాదు. చలాకీగా కన్పించాలి. సినిమాస్టార్లాగా సింగారించుకోవాలి. తన భార్య చదువుకున్నదీ; అందమైనదీ అని అందరిలో తనకు గర్వంగా వుండేట్లు నేనుండాలేకాని; నా మట్టుకు నాకు సంతోషం అక్కరలేదు." కన్నీళ్ళ ప్రవాహమైపోయింది అనూరాధ.

"ఏమిటమ్మా అది; పండగనాడు ?" తండ్రి కంఠం విన్పించి యిద్దరూ ఖంగారుగా లేచారు.

"ఏంలేదు నాన్నా. మళ్ళీ మీ అందర్నీ వదలిపోవడమంటే కష్టంగా వుంది" కళ్ళు తుడుచుకుని బలవంతాన నవ్వింది అనూరాధ.

"పెళ్ళయ్యాక అంతే కదమ్మా మరి? మళ్ళీ సంక్రాంతికి వస్తువుగాని, అల్లుడుగారితో నేను చెప్తానులే" అంటూ వెళ్ళిపోయాడు అనంతయ్య.

"అదేమే? నాన్నతో నీ కష్టసుఖాలు చెప్పుకోకూడదూ?" అడిగింది పంకజం.

"ప్చ్. అటువంటివి చెప్పుకోకూడదక్కా. అక్కడి మంచీ వాళ్ళ దృష్టంతా మన్నే పెట్టుకు బాధపడ్తారు.

ఆయినా; అమ్మా నాన్నా జాలిపడ్తారు కాని; అటువంటివి తెలుస్తే వదినకు లోకువై పోనా? ఎక్కడివక్కడ మర్చిపోవడం హాయి."

"పిచ్చి సిద్ధాంతాలు" నిరసించింది పంకజం. "ఆలాటి మొండి కాపురం నువ్వు గనుక చేస్తున్నావు కాని నేనైతే వచ్చి పుట్టింట్లో కూర్చుని; మూడు చెరువుల నీళ్ళు త్రాగించి అదుపులోకి తెచ్చివుందును."

"అంతేనా? నువ్వింకా తెలివైనదానివనుకున్నానే?" నిర్ఘాంతపోయింది అనూరాధ.

"అంతే!" చెల్లెలి హేళనకు పంకజం అహం దెబ్బ తిన్నది.

"ఇక్కడే వుండేవాళ్ళమయితే పెళ్ళి చేసుకువెళ్ళడమనే "లాంఛనం" కూడా ఎందుకు? చావో, బ్రతుకో, కష్టమో, నిష్ఠురమో, అది నా యిల్లు, నా సంసారం. ఎంత ఆత్మీయులైనా అన్నీ సవ్యంగా వుంటేనే గౌరవంగా చూస్తారు. కట్టుకొన్న భర్త దగ్గర లభించని గౌరవం కన్నతల్లివద్దకూడా కరువే. ఎన్ని చదువులు చదువనీ, ఎన్ని హక్కులు రానీ ఈ మానసిక జాడ్యం పోవడానికింకా కొంతకాలం పడ్తుంది. అంతవరకు మనం పాతదారినే నడవాలి. భర్తతో తెగతెంపులు చేసుకొచ్చిననాడు, ఈ అమ్మ ఆదరణా, నాన్న ప్రేమా, అన్నయ్య గారాం, వదిన నమ్రతా మచ్చుకైనా కన్పించవు" చివుక్కున లోపలి కెళ్ళిపోయింది అనూరాధ.

కొయ్యబారిపోయింది పంకజం. అంత హీనంగా చూస్తున్న భర్తే సర్వస్వమంటోంది అనూరాధ. ఆదినారాయణతో పోల్చిచూస్తే తన భర్త దైవ స్వరూపుడే. అటువంటి వ్యక్తిని చిన్నవిషయానికే తాను తూలనాడింది. తాను చేసింది నిశ్చయంగా తెలివితక్కువపనే. చిన్నదైనా ఎంత తెలివైనది అనూరాధ! అంతలో తల్లి కంఠం విన్పించింది వెనుకనుంచి.

“ఏమే అలా కూర్చున్నావ్ ఎండలో? పిల్లా ఆయన రాలేదనా? ఏంపని తగిలిందో ఏమో! పండగకదా– ఆ పిల్లాడిని కాస్త ముస్తాబు చేసుకోకూడదూ?”

“అలాగే లెద్దూ!” సిగ్గుపడుతూనే లేచింది పంకజం. రఘును స్నానం చేయించమని నౌకరుకు అప్పగించి, తాను బట్టలు తీయడానికి పెట్టెదగ్గర కూర్చుంది. కూర్చున్నదన్నమాటేగాని మెదడేమీ పనిచేయడం లేదు. అర్థరహితంగా పెట్టెలో దుస్తులన్నీ అటూ ఇటూ కెలకడం ప్రారంభించింది. ఆ కెలకటంలో పెట్టె అడుగున వున్న నీలి కవరొకటి పైకి వచ్చింది. ఆశ్చర్యపోతూ విప్పి అప్రయత్నంగానే సాంతం చదివింది.

డియర్ పంకజా!

ఆఫీసుకు వచ్చానన్న మాటేకాని ఆలోచనంతా నీమీదే. చాలా ఆలోచించి ఈ పని చేస్తున్నాను. ఇప్పుడు [illegible]

సేనేం చెప్పినా వినేటట్టు లేవు. అందుచేత నా అభిప్రాయా లన్నీ వ్రాసి పెట్టెలో పెట్టదలచుకున్నాను. బహుశః నీ కోపోద్రేకం తగ్గేసరికి ఇది నీ కంటపడగలదు.

హిందూ కుటుంబాలలో సర్వసాధారణంగా జరిగే వాటికే నీకెందుకింత కోపం రావాలో నాకు తెలియడంలేదు. అమ్మ సాధిస్తూంటుందనే కోపం కాని, ధనవంతుల పిల్లవు, చదువుకున్నదానవు అని ఏపనీ చెయ్యనీకుండా భోజనం వడ్డించి వంటగదిలోకి పిల్చే అత్తగార్లు మన భారతదేశంలో ఎందరున్నారంటావు? ఒక మంచికి ఒక చెడు, వుంటూనే వుంటుంది మానవమాత్రులలో; భరించాలి. ఏ స్త్రీకయినా సరే పుట్టిల్లు కుబేర భవనంకానీ, కుచేల గృహంకానీ—వివాహ పూర్వం పుట్టిల్లువేరు, వివాహానంతరం పుట్టిల్లు వేరు.

నువ్వు అక్కడ పుట్టి పెరిగావు. ఆ బంధాన్ని పురస్కరించుకుని అక్కడ నాల్రోజులుండిరావలసిన బంధువువే, కాని నీ కక్కడ అధికారం లేదు. ఇది నీ యిల్లు—నీ అధికారం చెల్లుతుంది. ఇహ ఎవరిమీద నీవు కోపగించి వెళ్ళేది అత్తగార్లు అధికారం చెలాయించడం ఎక్కడలేదు? అది అధికారం కాదు—అధికారాలు చేతులు మారేటప్పుడు కలిగే సంచలనం. జీవితంలో అన్ని సుఖాలూ లభ్యమవ్వడంలేదనీ, ఏదో వెలితి వుందనీ నీకు అనుమానం. కాని ఆలోచించిచూడు. నీ అంత అదృష్టవంతులు ప్రపంచంలో బహు స్వల్పం. నీకు ఏ లోటూలేదు; ఒక్క ధనికవర్గం దర్పాలు తప్ప. అది లేదు, ఇది లేదనే అసంతృప్తిని పెంచుకోవడంకంటె వున్నదాని విలువను తెలుసుకొని సంతృప్తి పడడంలోగల సౌఖ్యానికి సాటి

లేను. నీకంటే ఎవరో ఎక్కువగా, దగ్గరగా వుంటున్నారని నీ బాధ. కాని ఏ వివేకవంతుడూ సంపూర్ణ సౌఖ్యం లేదని, ఏవో లోటుపాట్లు ఉంటూనే వుంటాయని నీవు గుర్తించాలి. విద్యావతివైన నీవు మా పుకొంపల మనువును గూర్చి, ఎండమావులను గూర్చి నేను బోధించ నక్కర్లేదు.

తీరని కోర్కెలతో కరుడుగట్టిన పెద్దవాళ్ళను కఠినాత్ములుగా, ఛాందసులుగా తయారు చేస్తాయి. అందువల్ల వారి మాటలను పట్టించుకోకూడదు. నీకు ముఖ్యం నేనుగానీ, మా అమ్మకాదు. కోపంతో, అభిమానంతో వెళ్ళావు. వాటిని కలకాలం నీ మనస్సులో కాపురం చేయనీయకు; ఎప్పుడు రావాలనుంటే అప్పుడు నిస్సంకోచంగా నీ యింటికి నువ్వు రా. ఈ గృహద్వారాలూ, నా హృదయద్వారాలూ నీకు సదా సుస్వాగతం పలుకుతుంటాయి.

నీ

శ్రీధర్.

పంకజం అభిమానం పశ్చాత్తాపంగా మారి దుఃఖ రూపం దాల్చింది. ఆ రోజు స్టేషన్‌లో యిందుకే అతడు పెట్టెతాళం అడిగాడు. తానెంత నీచంగా మాట్లాడింది! అమృతమే అంతరంగంగా, దైవత్వమే ధనబలంగాగల ఈ ప్రేమమూర్తినా తాను అపార్థం చేసుకొన్నది !

[ఔను]

"పంకజా;" బయట ఎవరిదో పిలుపు. కళ్ళు తుడుచుకుని చావిడిలోకి వచ్చింది పంకజం. చిన్ననాటి స్నేహితురాలు కమల నిలబడి వుంది. విచారమంతా ఒక్కసారి మరచిపోయి సాదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టింది పంకజం.

"మా అమ్మాయి పుట్టినరోజు. నువ్వొచ్చావని తెల్సి వచ్చాను. ఏమిటి విశేషాలు?" బొట్టుపెడ్తూ అడిగింది కమల.

నవ్వింది పంకజం. "విశేషాలకేంగాని, నువ్వు మరీ యింత సనాతన ముత్తయిదువలా మారిపోయావేమిటి? చదువుకొనే రోజుల్లో సినీస్టార్స్‌కుకూడ ఫ్యాషన్స్ నేర్పేట్టుండేదానవు?"

తేలికగా నవ్వేసింది కమల. "అవన్నీ ఆ రోజులు. జీవితం మారిందిగా మరి? అంత ఫ్యాషన్‌గా ఉండడం మా వారికి నచ్చదు. ఉద్యోగంకూడ మానేశాను. ఎంత నవీన యుగమైనా వివాహజీవితం అన్నాక కొన్నికొన్ని త్యాగాలు, కట్టుబాట్లు తప్పవుమరి!"

"ఉద్యోగం మానేశావా?" ఆశ్చర్యంగా అడిగింది పంకజం.

"అవును పంకజం. ఇంత చదువూ చదివి సంసారంలో పడిపోవడమేమిటని కొన్నాళ్ళు మూర్ఖంగా ఆలోచించిదాన్ని, క్రమంగా అర్థంచేసుకున్నాను. ఒక మహా వటవృక్షంవద్ద నిలచి, దానికిగల అనేక కొమ్మల్లో ఒక కొమ్మనుండి చీలిన చిన్న శాఖనొక్క- ఒక ఫలంలోని ఒక పత్రాన్ని ఆ చెట్టుతో

పోల్చి చూస్తే ఎంత అల్పమో— నేటి ఒక విద్యాపట్టం విద్యావృక్షం ముందు అంత అల్పమైంది. బరువైన పదాలు వాడుతున్నానని అనుకోకు. ఈ విద్యని తెలివిగా సంసారం చెయ్యడానికూడా ఉపయోగించుకోవచ్చు. కాని ఉద్యోగమే చెయ్యక్కర్లేదని తెలుసుకున్నాను. భార్యగా, తల్లిగా నా ఉద్యోగం మానిపోయి ఇంకో ఉద్యోగం దేనికి చెప్పు? నిజానికి నేను ఉద్యోగం చేసినన్నాళ్ళూ సంసారం చిన్న నరకంలా వుండేది. నా కర్గ నిర్లక్ష్యానికీ, కరకుదనానికీ గుర్తై పిల్లలు విలవిల్లాడి పోయేవారు. నేను ఉద్యోగం మానేసాక హాయిగా వున్నారు."

"అయితే అందువల్ల నీవు నిజంగా సుఖంగా, ఆనందంగా ఉందా కమలా?"

"సందేహమా? నన్ను ప్రేమించే భర్త, నా రక్తం పంచుకున్న పిల్లలూ; వాళ్ళ సంతోషానందాలూ నావికావా పంకజం? పగలంతా ఆయన ఆఫీసులో శ్రమపడి వస్తారు. కుటుంబం పనిలో నేను శ్రమపడి ఉంటాను. ఒకరి సాహచర్యంలో ఒకరం—యిద్దరి శ్రమా మర్చిపోవచ్చుగదా? ఇద్దరం ఉద్యోగంచేసి విసుగుతో యింటికి చేరి, ఒకరిపై ఒకరం విసుక్కుని, ఇద్దరి చిరాకూ అమాయకులైన పిల్లల మీద చూపడం ఏం బాగుంది చెప్పు? బిడ్డకు గోరుబువ్వ తినిపిస్తూ—

చందమామ రావే అని పాడి ప్రకృతి జ్ఞానగ్రంథంలో ప్రాథమిక పాఠం ప్రారంభించి;

నాకల్నిస్తా, నేకల్నిస్తావా? అని ఆడించడంలో లోక జ్ఞానం పోస్తూ—

ఏ పూర్వపుణ్యమో,  
ఏ యోగబలమో,  
వెలసినావీ వీర పుణ్య దేశాన;  
ఈ దేశముల సాటేదు వగ రాదూ.

జో...... జో...... అని జోలపాడడంలో మన జాతి సంస్కృతికీ, సాంప్రదాయాన్ని నేర్పుతుంది తల్లి. తల్లి లేని దురదృష్టవంతుల సంగతి వేరేలెండి. తల్లి వుంటే, బిడ్డను ఆ తల్లి ఒడికి దూరం చేయగలిగినంత విచారకర విషయం అదే కాని మరొకటి లేదు. తర్వాత తర్వాత క్రమంగా ఎదుగుతూ "సరస్వతీ నమస్తుభ్యం... ఓం నమః... భూమి గుండ్రముగా ఉండును... [illegible] గ్రహ సిద్ధాంతం ప్రకారము... షేక్స్పియర్ కావ్యంలో... ఐన్‌స్టీన్ సిద్ధాంతం ప్రకారము... ఈవిధంగా విజ్ఞాన శాస్త్రం వొంటబట్టించాను. కాని ఎంత చదవనీ; ఎన్ని పట్టాలు పొందనీ అవన్నీ ఒకెత్తు. తల్లి పెంపకంలో పొందిన బుద్ధి జ్ఞానాలు ఒకెత్తు. ఇవన్నీ ఆలోచించే నేను ఉద్యోగం మానేశాను. వెళ్లాను మరి."

విస్మయంతో కమల వెళ్ళిన దిక్కే చూస్తూ వుండి పోయింది పంకజం. విన్నకొద్దీ; చూచినకొద్దీ ఆమె బాధ; పశ్చాత్తాపం ఎక్కువై పోతున్నాయి. ప్రతివారి నోటినుండీ ఒకటే మాట!

పిచ్చుకల కిచకిచలు ఆలోచనల కంతరాయం కలిం చగా దృష్టి అటు త్రిప్పింది. స్వేచ్ఛగా నిర్విచారంగా కొమ్మ కొమ్మకూ ఎగురుతూన్న ఆ పిచ్చుకల జంటను చూస్తుంటే "ఏ బాధా విచారమూ లేని వాటి జీవనమెంత హాయి?" అనిపిం చింది పంకజానికి. అంతలో ప్రక్కింటి పిల్లవాడు వాటిలో ఒక దాన్ని "కేటిల్ బాల్" తో పడగొట్టాడు. మిగిలినవన్నీ భయంతో ఎగిరిపోయాయి. పంకజానికి జ్ఞానోదయమైంది. భ[illegible] ప్రాణిసృష్టిలో నాకు దూరపుకొండల నునుపుకే వెరతి పోతోంది. పరాధీన జీవరాసులలో [illegible] ఒక్క ప్రాణికీ సంపూర్ణ సౌఖ్య స్వాతంత్ర్యాలు లేవు!

"నాన్నా: యిప్పుడొక ట్రైయిను వుంది. నను పంపిం చెయ్యండి." అంది తండ్రి గదిలోకి వెళ్ళి...

సీతమ్మ ఆశ్చర్యంగా చూచింది. అమావాస్యపూట వెళతావా?"

తెలివైన అతిసంతయ్య కూతురి స్థితి చిటికెలో గ్రహిం చేశారు. "ఎప్పుడైతేనేం, వాళ్ళయింటికి వెళ్ళడానికి?" అని భార్యను ఓదార్చి కూతుర్ని సాగనంపాడు.

## 7

పంకజం బండి దిగుతూండగానే శ్రీధర్ చిరునవ్వుతో ఎదురు వచ్చి రఘును అందుకున్నాడు. "కాళ్ళు కడుక్కోమ్మా, ఎప్పుడో భోంచేశావో!" అంటూ జయమ్మ త్వర త్వరగా వడ్డించి భోజనం చేస్తున్నంతసేపూ దగ్గరే కూర్చుని పుట్టింటివారి యోగక్షేమాలు అడుగుతూనేవుంది. పండగ నాడే తిరిగి వచ్చిన తనను ఎంత హేళన చేస్తారో అని భయపడిన పంకజం యేమాత్రం కోపం లేని ఆ తల్లీకొడుకుల ఆదరాభిమానాలకు సిగ్గుతో తలెత్తలేకపోయింది. "పండగనాడు యిలా యింత సామాన్యంగా వున్నారేమిటి?" అనడిగింది కడకెలాగో.

జయమ్మ నిండుగా నవ్వింది. "ఇంటికి దీపంలా నువ్వొచ్చావు మరి? ఇక అంతా పండగే?"

శ్రీధర్ చిరునవ్వుతో అన్నాడు. "మనకెప్పుడు సంతోషంగా వుంటే ఆనాడే పండగ. ప్రత్యేకంగా పండగేమిటి?"

పంకజం మరింత సిగ్గుపడిపోయింది. వారికి తనతోడిదే జీవితమున్నట్లు.

జయమ్మ మనుమడితో ఆడుకుంటూ కూర్చుంది. పంకజం శ్రీధర్ గదిలోకి వెళ్ళింది. "నేను చాలా పొర పడ్డాను. నన్ను క్షమించండి. అంది తలవంచుకుని, నేలపై కూర్చుంటూ.

"ఛ ! మనలో మనకు క్షమాపణలేమిటి? అక్కడే, క్రిందకూర్చోకు."

ప్రేమతో దగ్గరకూర్చో బెట్టుకున్నాడు శ్రీధర్. "నీ ఆగ్రహం అణగడానికి అధమం ఆరునెలలైనా పడుతుందను కున్నాను. కాని ఆరురోజులే సరిపోయాయి.

"నేనూ పొరపడ్డానన్నమాట!" అన్నాడు చిలిపిగా.

నవ్వేసింది పంకజం. "ఇక ఎన్నడూ మీ మనస్సు నొప్పించను. ఆడంబరాలకూ అనురాగాలకూ గల తారత మ్యాలు గ్రహించాను." అంది మెల్లగా.

ఇంటింట ఆనంద దీపావళి...... రేడియో సన్నగా పాడుతోంది.

శ్రీధర్ తృప్తిగా వూపిరిపీల్చాడు. "నిజంగా నా జీవి తంలో మరపురాని సుదినం ఈరోజు. సంతోషజీవితాని కవ సరమైన సంతృప్తి నీలో కల్గింది.

భర్త వాదించినా వినకుండా పంకజం తన అనుభవా లన్నీ ఏకరువు పెట్టింది." "హమ్మయ్య. అంతా మీతో చెప్పేశాక నా హృదయం తేలికైంది." అంది నవ్వుతూ.

అంతా విన్న శ్రీధర్ గంభీరంగా అన్నాడు. "సిరాం బరం క్రింద నిర్మల కాసారంలో ఇంతకంటె సుందరమైనది

ఉన్నవా అని భ్రమిస్తాం ఆ సౌందర్య లావణ్యాలు చూచి.
కాని అది పంకజంలో పుట్టిగిట్టుతున్న పుష్పం. బహుశః
పంకజనితనని ఆ అద్వితీయకుసుమం – లక్ష్మీనివాసస్థాన
మైన ఆ సహస్ర దళకమలంకూడ విచారిస్తుంటుం దేమో :
అయినా అది భగవద్విలాసం ప్రతి అందం అడుగునా ఒక
లోపం. ప్రతిసుఖం వెనుకా ఒక వెత్త వుంటాయి. సరిపెట్టను
పోవడంకంటె మార్గం లేదు.”